క్లుప్తంగా

'వేద'లో స్వర్ణ ప్రాశన



జనగామ: పట్టణంలో హైదరాబాద్‌రోడ్డు ఏకశిల బీఈడీ కళాశాల ఎదురుగా ఉన్న వేద ఆయుర్వేద పంచకర్మ వెల్‌నెస్ దవాఖానలో మంగళవారం పుష్యమి నక్షత్రం, తండ్రి సత్తిరెడ్డి జ్ఞాపకార్థం డాక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో 6 నుంచి 16ఏళ్ల వయస్సు పిల్లలు, యువకులకు ఉచితంగా స్వర్ణప్రాశన వేశారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ స్వర్ణ ప్రాశనతో పిల్లల్లో ఎముకల పటిష్టత, మేథాశక్తి, జీర్ణశక్తి పెరుగుతుందన్నారు. అలాగే శరీరం రంగు, పెరుగుదలకు దోహదపడుతుందన్నారు. ప్రతి నెల స్వర్ణ ప్రాశన ఉచితంగా వేయడం జరుగుతుందని, ప్రస్తుతం 100 మంది పిల్లలకు వేసినట్లు చెప్పారు.

సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి

జనగామ రూరల్: పట్టణంలోని మూడో వార్డులో పలు ప్రాంతాల్లో వెంటనే సీసీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీలు నిర్మించి మురుగునీరు వర్షపు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిది గోపి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో కాలనీవాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ మహేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. జోగు ప్రకాశ్, బింగి మధు, శ్రీనివాస రెడ్డి, బైరగోని శ్రీనివాస్, మాడూరి బాలయ్య పాల్గొన్నారు.

సర్పంచ్ పదవికి ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలి

తరిగొప్పుల: గ్రామపంచాయతీగా ఏర్పడి 6 దశాబ్దాలు అయినప్పటికీ నేటికి సర్పంచ్ పదవికి ఎస్సీ రిజర్వేషన్ కేటాయించలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ జీపీకి ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన ఎస్సీ కులస్తులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం ఎంపీడీఓ ఆలేటి దేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ మొగుళ్ల మహిపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాగభూషణం, నరేష్, రామకృష్ణ, బక్క చిరంజీవి, బాబు, చింటు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

తరిగొప్పుల: గర్భిణులు, బాలింతలు, కిషోర బాలబాలికలు పోషణ విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రంగమ్మ అన్నారు. మండలంలోని బొంత గట్టునాగారం అంగన్‌వాడీ కేంద్రంలో ఎస్‌హెచ్‌జీ మహిళలతో కలిసి మంగళవారం పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ రంగమ్మ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారంపై చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. వీఓ అధ్యక్షులు శాంతి, వీఓఏ నాగరాజు, సీసీ రామచంద్రం, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

దేవరుప్పుల: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి సూచించారు. మండలంలోని ధరావత్‌తండా క్లస్టర్ పరిధిలో పోషణమాసోత్సవం పురస్కరించుకుని గిరిజన ప్రజల కోసం అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.

సన్మానం



లింగాలఘణపురం: ఇటీవల మండల కేంద్రానికి చెందిన మద్రిక్కుల కనకలక్ష్మికి నెల్లుట్ల వద్ద ఆటోలోనే ప్రసవం జరిగింది. ఆ సమయంలో అక్కడే ఉన్న నెల్లుట్లకు చెందిన ఆశ వర్కర్లు కనకలక్ష్మికి సహాయక చర్యలు చేపట్టారు. కాగా, గ్రామ యువకులు మంగళవారం ఆశ వర్కర్లు సరస్వతి, సుగుణ, పద్మ, ఉమ, అరుణ, పుష్ప, రజిత, మనోహరలను గ్రామ యువకులు నల్ల రాహుల్ సన్మానించి మాట్లాడుతూ వృత్తి ధర్మంలో సమయస్ఫూర్తిని ప్రదర్శించి పలువురికి ఆదర్శంగా నిలిచారని అభినందించారు. యువకులు విల్సన్, అమృత్, కమలాకర్, లక్ష్మణ్, దిలీప్, కర్ణ ఉన్నారు.

ఈజీఎస్ గ్రామ సభలు



బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024–25 సంవత్సరానికి జరిగిన పనుల వివరాలపై వీఎస్‌ఎల్‌లు, డీఆర్‌పీలు సర్వేలు నిర్వహించారు. మంగళవారం మండలంలోని సర్వే చేసిన వివరాలపై ఆలింపూర్, బండనాగారం, కేసిరెడ్డిపల్లి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షతన గ్రామ సభలను నిర్వహించారు. ఈ సభలో సంవత్సరంలో జరిగిన పనుల వివరాలను, లోపాలను వివరించారు. పంచాయతీ కార్యదర్శులు నర్సింహాచారి, భరత్‌కిషోర్, రేవతి, డీఆర్పీలు రాజశేఖర్, భాను, కూలీలు పాల్గొన్నారు.

బంతిసాగు.. భలేబాగు

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం
- మండల పరిధిలో 20 ఎకరాల్లో సాగు



ఇప్పగూడెంలో సాగుచేసిన బంతిపూలు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించే దిశగా బంతిపూల సాగు కలిసివస్తోంది. బంతిపూల సాగు రైతులకు లాభాల పంట కురిపిస్తుంది. ప్రతీ ఏడాది ఎంగిలిపూల బతుకమ్మ పండుగ నుంచి సంక్రాంతి పండుగ వరకు బంతిపూలకు డిమాండ్ ఉంటుంది. బతుకమ్మ పండుగకు, దీపావళికి, కార్తీక మాసంలో గౌరీ నోములు, లక్ష్మీపూజలు, వ్రతాలు, వివాహాలు పలు శుభకార్యాలకు బంతిపూల అవసరం ఎంతో ఉంటుంది. దీపావళి నోములు, కార్తీక మాసం పూజలకు బంతిపూలతో అలంకరణలు చేస్తారు. నవంబర్, డిసెంబర్ మాసాల్లో జరిగే అయ్యప్పస్వామి పూజలకు, జనవరిలో జరిగే సంక్రాంతి పూజలకు బంతిపూల వినియోగం ఎక్కువగా ఉంటుంది. అదేవిధంగా డివిజన్‌లోని వివిధ దేవాలయాల బ్రహ్మోత్సవాల అలంకరణకు బంతిపూలను విరివిగా వినియోగిస్తారు. అయితే పూల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్ళకుండా డివిజన్‌లోని వివిధ మండలాల్లో కొందరు రైతులు తమకున్న వ్యవసాయ భూమిలో పావు, అర ఎకరంలో బంతిపూల సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. బంతిపూల సాగుకు పెట్టుబడి ఖర్చులు పెద్దగా లేకపోవడం, పెట్టుబడికి రెట్టింపు లాభాలు వస్తుండగా పలువురు బంతిపూల సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

తక్కువ సమయంలో పంట దిగుబడి

బంతిపూలసాగుతో తక్కువ సమయంలో పంట దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఘన్‌పూర్ డివిజన్‌లోని వివిధ మండలాల సన్నచిన్నకారు రైతులు బంతిపూల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. సాధారణంగా ఒక ఎకరం తోటలో 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు పూల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. అయితే ఎకరా పంటకు రూ.50వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు చెపుతున్నారు. ఘన్‌పూర్ మండల పరిధిలో పలువురు రైతులు తమకు చెందిన వ్యవసాయ భూమిలో పది గుంటలు, 20 గుంటల భూమిలో బంతి పూల సాగు చేశారు. నీటి వసతి తక్కువగా ఉన్న రైతులు బంతితోటలు సాగుచేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో దాదాపు 40 మంది రైతులు దాదాపు 20 ఎకరాల్లో బంతిపూల సాగుచేస్తున్నారు.

బంతిపూల సీజన్ ప్రారంభం

ప్రతీ ఏడాది సెప్టెంబర్ నెలలో బంతిపూల సీజన్ ప్రారంభమై జనవరి వరకు ఉంటుంది. బంతిపూల సాగుకు శ్రమ, పెటుబడి తక్కువ కావడం, తక్కువ సమయంలోనే దిగుబడి వస్తుండగా పలువురు రైతులు తమకున్న పొలంలో కొంత విస్తీర్ణాన్ని బంతిపూల సాగుకు కేటాయిస్తున్నారు. ప్రతీ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో బంతిపూలకు డిమాండ్ అధికంగా ఉంటుంది. నవంబర్ మాసంలో జిల్లా వ్యాప్తంగా పలువురు అయ్యప్ప దీక్షను స్వీకరిస్తారు. అదేవిధంగా కార్తీక మాసంలో పలు పూజలు, నోములు, వ్రతాలు ఉంటాయి. అందుకే రైతులు రెండు నెలల ముందు నుంచే అంటే ఆగస్టు, సెప్టెంబర్ నుంచే పూలసాగు చేస్తారు. రెండునెలల్లో దిగుబడి వస్తుంది. సాధారణంగా పంట కాలం 100 రోజుల నుంచి 120 రోజుల వరకు ఉంటుంది. దిగుబడి సాగు చేసిన 50 నుంచి 60 రోజుల నుంచే ప్రారంభం అవుతుంది. తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమ, తక్కువ సమయంలోనే దిగుబడి వస్తుండటంతో చిన్నసన్నకారు రైతులు బంతిపూల సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

ఎకరం భూమిలో సాగు చేశా



ప్రతీ ఏడాది బంతిపూల సాగు చేస్తున్నా. ఎకరం భూమిలో బంతిపూల సాగు చేస్తూ మిగిలిన భూమిలో మొక్కజొన్న తదితర పంటలు సాగుచేస్తున్నా. బంతిసాగు పెట్టుబడికి ఎకరాకు సీడ్‌కు రూ.30వేలు, సాగు ఖర్చు 20వేలు మొత్తంగా దాదాపు 50వేల ఖర్చు అయింది. అయితే ప్రకతి అనుకూలించి ఎలాంటి వర్షాల బెడద లేకుంటే బాగుంటుంది బతుకమ్మ పండుగకు, దీపావళి నోములకు, కార్తీకమాసంలో బంతిపూలకు భలే గిరాకి ఉంటుంది. కిలోకు రూ.100 చొప్పున విక్రయిస్తా.

– గొడిశాల నాగేందర్, రైతు, ఇప్పగూడెం

పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టం

- తహసీల్దార్ రవీందర్



మాట్లాడుతున్న తహసీల్దార్ రవీందర్

లింగాలఘణపురం: అధికార యంత్రాంగంలోని పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టమని (ఆర్‌టీఐ), ప్రభుత్వం నుంచి ప్రతి పౌరుడు సమాచారం పొందవచ్చని తహసీల్దార్ రవీందర్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఈ చట్టంపై అవగాహన కల్పించుకుని ప్రభుత్వంలో జరిగే అక్రమాలు, అవినీతిపై ప్రశ్నించవచ్చని వివరించారు. అధికారులు సహితం జవాబుదారితనంగా వ్యవహరించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురామకృష్ణ, ఎస్సై శ్రావణ్‌కుమార్, ఏపీఎం నాగేశ్వర్‌రావు, నాయబ్ తహసీల్దార్ షకీర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో గుండెపోటు మరణాలు నివారించవచ్చు

- మండల వైద్యాధికారి రవితేజ



కస్తూర్బా హాస్టల్‌లో సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న వైద్యాధికారి రవితేజ

దేవరుప్పుల: ఆకస్మిక గుండెపోట్లతో సంభవిస్తున్న మరణాలను హృదయ శ్వాసకోశ పునర్జీవనచర్యతో నివారించవచ్చని మండల వైద్యాధికారి రవితేజ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీపీఆర్ విధానంపై ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవితేజ మాట్లాడుతూ గుండె పోటుకు గురైన సందర్భాల్లో సీపీఆర్ ద్వారా గుండెకు రక్తప్రసరణ, నోటిద్వారా ఆక్సిజన్ అందించడంతో బాధితులను రక్షించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆడెపు అండాలు ఎంపీడీఓ తాటి సురేష్ కుమార్, హాస్టల్ ప్రత్యేకాధికారి సుకన్య, డాక్టర్ మనోజ్ డాక్టర్ వరలక్ష్మి డాక్టర్ శిరీష ఎఎన్‌ఎం వసంత, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్షర ఉద్యమంలో రేణుక సజీవం

- తల్లిదండ్రులు జయమ్మ, సోమయ్య



రేణుక జయంతి వేడుకల్లో కుటుంబసభ్యులు

దేవరుప్పుల: భారత విప్లవ సాహిత్య (అక్షరం) ఉద్యమంలో తన కూతురు సజీవంగానే ఉంటుందని గుముడవెల్లి జయమ్మ, సోమయ్యలు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కడవెండిలో మావోయిస్టు, ఛత్తీస్‌గఢ్ నేత గుముడవెల్లి రేణుక అలియాస్ దమయంతి అలియాస్ మిడ్కో 55వ జయంతి వేడుకలు పురస్కరించుకుని కుటుంబ సభ్యులు ఆమె చిత్రపటంతోపాటు ఇంటి స్థలంలో నిర్మించిన స్మారక స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య స్మారక స్తూపం ఎదుట ఆడుతూ, పాడుతూ పెరిగి పెద్దయిన రేణుక తిరుపతిలో లా చదువుతూ, విప్లవ రచయిత్రిగా, ఉద్యమకారిణిగా ఎదిగిన క్రమాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమంలో పంతం అచ్చయ్య, కాడబోయిన స్వామి, కాశబోయిన యాకయ్య, గుముడవెల్లి భిక్షపతి, శ్రీను, యాదగిరి, సోమయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరుస్తున్న సీఎం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల సొంతింటి కలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేరుస్తున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కొనియాడారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన 256 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా అడిషనల్ కలెక్టర్ పింకేశ్ కుమార్ హాజరయ్యారు. ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం మాట్లాడారు..నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అందులో 95 శాతం ప్రారంభమై వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఎంపీ కావ్య మాట్లాడుతూ..గత బీఆర్‌ఎస్ పాలనలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ వసంత, జనగామ, హన్మకొండ జిల్లాల హౌసింగ్ పీడీలు మాతృనాయక్, హరికృష్ణ, ఏఎంసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎస్.ఐలయ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని కంటతడి

అర్హత ఉన్నప్పటికీ తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఛాగల్లుకు చెందిన నిరుపేద దళిత కుటుంబానికి చెందిన దివ్యాంగుడు చేపూరి మహేందర్ కంటతడిపెట్టాడు. సభావేదిక వద్ద తమకు అర్హత ఉన్నప్పటికీ ఇల్లు మంజూరీ కాలేదని మహేందర్‌తో పాటు పులి మంజుల తదితరులు ఎమ్మెల్యే కడియం శ్రీహరికి విన్నవించారు. ఇందుకు ఆయన స్పందిస్తూ మరో విడతలో మిగిలిన అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు అందిస్తానని చెప్పి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

నూతన కమిటీ ఎన్నిక

నర్మెట: గ్రామ పంచాయతీ సిబ్బంది మండల నూతన కమిటీని జిల్లా కార్యదర్శి నారోజు రామచంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిర్ర వెంకట్ రెడ్డి (నర్మెట), కుంటి ఎల్లయ్య (అమ్మాపురం), కార్యదర్శులుగా కొలెపాక రమేష్ (నర్మెట), వేల్పుల ఆంజనేయులు (వెల్దండ), సహాయ కార్యదర్శిగా గొల్లపల్లి రమేశ్ (హన్మంతాపురం), కమిటీ సభ్యులుగా గాదెర పద్మ, ఇస్లావత్ రామకృష్ణ, గోల్కొండ మల్లయ్య, లింగాల విజయ్, కొలపురి విజయ్, గాదెర రత్నం, శ్రీను, మెతుకు సత్తయ్య, రాజమణి, పుట్ట నర్సింహులు తదితరులు ఎన్నికయ్యారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్ రావు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

బచ్చన్నపేట: మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మహిళా ఆరోగ్యం సమాజానికి శ్రేయస్కరం అని డీఎంహెచ్‌ఓ కె.మల్లికార్జున్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలో వైద్యసేవలు ఎలా అందుతున్నాయని, ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ సృజన, డాక్టర్లు ప్రసన్నకృష్ణ, ఫార్మాసిస్ట్ బొడ్డు శ్రీనివాస్, సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాన్ని గ్రంథాలయంగా మార్చాలి



నిరుపయోగంగా ఉన్న భవనాన్ని పరిశీలిస్తున్న యువకులు, కాలనీవాసులు

జనగామ రూరల్: స్థానిక సంజయ్‌నగర్‌లో నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌ను గ్రంథాలయంగా మార్చాలని అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ కోరారు. మంగళవారం పట్టణంలోని నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని ఆయన కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మణికుమార్ మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ సెంటర్ వద్ద పిచ్చిమొక్కలు పెరిగి క్రిమికీటకాలు, పాములు వస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పండుగ నరేష్, గట్టుపల్లి బాలస్వామి, మోతే వెంకటయ్య, కెమిడి రమేష్, ఉల్లెంగుల రాము, మేడ స్వరూప, దాసరి క్రాంతి పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేశ్



మాట్లాడుతున్న రమేశ్

చిల్పూరు: బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్ల పేరుతో మోసం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. వంగాపల్లి గ్రామంలో మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీసీల కోసం బీజేపీ ఎంతో కృషి చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా జిల్లాలో బీజేపీ జెండా ఎగువ వేయడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ కాదుగాయ రమేష్, ఏబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్‌గౌడ్, వెలిశాల శ్రీనివాస్, అరూరి ప్రవీణ్, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

వేలం వాయిదా

లింగాలఘణపురం: మండలంలోని నవాబుపేట అంగడిలో పశువుల రహదారుల హక్కు కోసం ఏర్పాటు చేసిన వేలం పాటకు ఒక్క టెండర్ కూడా మంగళవారం వరకు రాకపోవడంతో ఈ నెల 15న నిర్వహించాల్సిన వేలంను వాయిదా వేస్తున్నట్లు ఈఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. గత నెల 18వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించిన వేలం పాటలో దేవస్థానం పాట రూ.కోటి కాగా కేవలం రూ.26లక్షలకు పైగా రావడంతో వాయిదా వేసి తిరిగి ఈ నెల 15న నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు చేశారు. 14న సాయంత్రం వరకు ఏ షెడ్యూల్ ఫారం కూడా ఎవరు తీసుకోకపోవడంతో టెండర్‌ను వాయిదా వేసి తదుపరి తేదీని ప్రకటిస్తామని ఈఓ వివరించారు.

నివాళి

బచ్చన్నపేట: ఆలింపూర్ గ్రామానికి చెందిన సిద్దేశ్వరాలయ దేవస్థాన డైరెక్టర్ మంతపురి రాములు సతీమణి శాంతమ్మ మృతి చెందింది. మంగళవారం పలువురు నాయకులు మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ బండకింది హరిబాబుగౌడ్, ఆలయ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, నిమ్మ కర్ణాకర్‌రెడ్డి, ఈర్ల శివరాములు, రామకృష్ణ, వెంకటయ్య ఉన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడిని నిలదీత

బచ్చన్నపేట: ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి మురళీకృష్ణను మంగళవారం మండల కేంద్రానికి చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీశారు. ఈ సందర్భంగా పేరెంట్స్ మాట్లాడుతూ ఆదివారం పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా మురళీ కృష్ణ ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలలోకి ప్రవేశించి విద్యార్థుల ఫొటోలో తీశాడని అన్నారు. తమ ఇష్ట ప్రకారమే ప్రత్యేక తరగతులు నడుస్తున్నాయని, ప్రశ్నించడానికి మీరు ఎవరంటూ మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయం ఎదుట మురళీకృష్ణ వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలను నిర్వహించాలని అనుమతి పత్రాన్ని పేరెంట్స్ అందించారు. తల్లిదండ్రులు ఖలీల్, చెరుకూరి శ్రీనివాస్, బాషెట్టి వేణు, పరమేశ్వర్, శ్రీరాం, సమ్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మమత తదితరులు పాల్గొన్నారు.

భూమి కేటాయింపులో నిర్లక్ష్యం

బచ్చన్నపేట: మండలంలోని సాల్వాపూర్ గ్రామానికి మంజూరు అయిన సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి కేటాయింపులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్, గ్రామ మాజీ సర్పంచ్ బండకింది హరిబాబుగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. అధికారులు చొరవ తీసుకొని సబ్‌స్టేషన్‌కు భూమిని కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు బత్తిని వెంకటేష్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

స్టడీ మెటీరియల్ పంపిణీ

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ జెడ్పీఎస్‌ఎస్ పాఠశాల నుంచి ఈ సంవత్సరం నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు హాజరవుతున్న 8వ తరగతి విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్, మోడల్ ప్రశ్నాపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యూత్ ఫర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మేనేజర్ ఎం.అరవింద్ విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ అందించినట్లు తెలిపారు. సంస్థ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మేనేజర్ అరవింద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన పూజ



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అర్చకుల వేద మంత్రాల నడుమ అష్టదళ పాద పద్మారాధన పూజను వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి



చిల్పూరు: తన ఇంటిని చూసైనా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన న్యాలపోగుల రవి అధికారులను కోరారు. రెండో విడతలో పేరు లేక పోవడంతో మంగళవారం ఇంటి ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తాను ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య, ఇద్దరు పిల్లలు, తల్లితో శిథిలావస్థకు చేరిన ఇంట్లో నివసిస్తున్నట్లు తెలిపారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు కులాల వారిగా ఇవ్వడంతో తమకు అవకాశం రాలేదని, దీంతో రెండో విడతలో మంజూరు చేస్తారేమోనని ఆశతో ఎదురు చూస్తే 15 మంది పేర్లే వచ్చాయని, అందులో తమ పేరు లేదని వాపోయాడు. తాము నివసిస్తున్న ఇంటిని పరిశీలించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రఘునాథపల్లి: గ్రామాల సమగ్రాభివృద్ధికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎంతో కృషి చేస్తున్నారని మేకలగట్టు మాజీ సర్పంచ్ గడ్డమీది సంధ్యారాణికిరణ్ అన్నారు. గ్రామానికి ఎమ్మెల్యే మంజూరు చేసిన రూ.8 లక్షల సీసీ రోడ్డు పనులను మంగళవారం స్థానిక నాయకులు, గ్రామస్తులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే, ఎంపీ కడియం కావ్య సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఉడుత గోపాల్, నాయకులు ఇల్లందుల ప్రకాష్, ఎల్లయ్య, బొమ్మెర భరత్, ఉడుత అంజయ్య పాల్గొన్నారు.

గోదావరి జలాలను మళ్లించాలి

బచ్చన్నపేట: బొమ్మకూర్ రిజర్వాయర్ ద్వారా వచ్చే గోదావరి జలాలను మండలానికి మళ్లించాలని, తపాస్‌పల్లి రిజర్వాయర్ దాటి వెళ్లకుండా చూడాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాసపేట రవీందర్‌రెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. గుర్రపు బాల్‌రాజు, నిమ్మ కర్ణాకర్‌రెడ్డి, నల్ల మల్లయ్య, చెప్యాల లక్ష్మయ్య, ఎల్లయ్య, సుభాష్ పాల్గొన్నారు.

నేడు సబ్సిడీపై వేరుశనగ విత్తనాల పంపిణీ

పాలకుర్తి: సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు ఆగ్రోస్–1 రైతు సేవా కేంద్రంలో ఈనెల 15వ తేదీన పంపిణీ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాదికారి తెలిపారు. మంగళవారం ఏఓ మాట్లాడుతూ 20 కిలోల బస్తాను రూ.1,380లకు ఇవ్వడం జరుగుతుందన్నారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డును తీసుకుని రావాలని ఏఓ చెప్పారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

రఘునాథపల్లి: మండలంలో ఈ నెల 15 నుంచి నవంబర్ 14 వరకు గ్రామాల వారిగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి ఎస్‌కే ఆసీఫ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 17 వరకు కోమళ్ల, రఘునాథపల్లి, నిడిగొండ, 18 నుంచి 20 వరకు గోవర్దనగిరి, బాంజీపేట, ఫతేషాపూర్‌లో, 21 నుంచి 23 వరకు కుర్చపల్లి, వెల్ది, ఇబ్రహీంపూర్, 24 నుంచి 27 వరకు అయ్యవారిగూడెం, ఎల్లారెడ్డిగూడెం, శ్రీమన్నారాయణపురం, 28 నుంచి 30 వరకు అశ్వరావుపల్లి, కంచనపల్లి, లక్ష్మీతండా, నవంబర్ 1 నుంచి 4 వరకు గబ్బెట, 5 నుంచి 14వ తేదీ వరకు మిగతా గ్రామాల్లో టీకాలు వేయనున్నట్లు రైతులు తమ ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని ఆమె కోరారు.

బీజేపీకి మహిళా సమానత్వంపై చిత్తశుద్ధి లేదు

- ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అహల్య, షబానా



మాట్లాడుతున్న షబానా

జనగామ రూరల్: బీజేపీకి మహిళా సమానత్వంపై చిత్తశుద్ధి లేదని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇర్రి అహల్య, ఎండీ షబానా విమర్శించారు. మంగళవారం స్థానిక ఐద్వా కార్యాలయంలో పందిళ్ల కల్యాణి అధ్యక్షతన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14వ జాతీయ మహాసభలు 2026 జనవరి 25 నుంచి 28వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభల్లో దేశ వ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై హింస, వేధింపులు, హత్యలు, అత్యాచారాలు విపరీతంగా పెరిగాయన్నారు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళల రిజర్వేషన్ బిల్లు కేంద్ర ప్రభుత్వం చట్టం చేసినప్పటికీ అమల్లోకి రాలేదన్నారు. మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలన్నారు. జిల్లా కమిటీ సభ్యురాలు సీహెచ్ శ్రీలత, పట్టణ అధ్యక్షులు బండ రమాదేవి, కొండ వరలక్ష్మి, మమత, సంపత్, విజయ, రేణుక, బిట్ల లక్ష్మి, మచ్చ యాదలక్ష్మి, మంజుల, సుజాత పాల్గొన్నారు.